


# 'రైతు భరోసా' లేనట్లేనా!

- రైతుల అభిప్రాయాలు సేకరించిన మంత్రివర్గ ఉప సంఘం
- అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు రాని అంశం
- ప్రస్తుత వానాకాలం సీజన్‌కు అందడం కష్టమే..

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతు భరోసా పథకం కింద రైతులకు ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం అందే అవకాశాలు కనబడడం లేదు. ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం ఇంకా మార్గదర్శకాలను రూపొందించకపోవడంతో వచ్చే యాసంగి సీజన్ నుంచి అమలుచేయవచ్చని తెలుస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ప్రకటించింది. అందులో భాగంగా రైతు భరోసా పథకాన్ని అమలుచేస్తామని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ఒక్కో ఎకరానికి రెండు సీజన్లకు కలిపి 15 వేల రూపాయలు, కౌలు రైతులకు కూడా అంతే మొత్తాన్ని, రైతు కూలీలకు 12వేల రూపాయల చొప్పున అందజేస్తామని ప్రకటించింది. అంతకుముందు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇదే పథకాన్ని రైతుబంధు పథకంగా అమలుచేసింది. పట్టా కలిగిన వారందరికి సీజన్‌కు 5వేల చొప్పున రెండు సీజన్లకు కలిపి 10 వేల రూపాయల పెట్టుబడి సాయాన్ని అందజేసింది. ఇందులో కౌలు రైతులకు ఎలాంటి సాయాన్ని అందజేయ లేదు. ఈ పథకం అమలుచేసేందుకు అప్పటి ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అనుసంధానం చేసుకుని నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేసింది. ఈ క్రమంలో సాగులో ఉన్న, సాగులో లేని భూములు, రహదారులు, ప్రాజెక్టుల కింద సేకరించిన భూములకు, నాలా మార్పిడి చేయకుండా వెలసిన రియల్ ఎస్టేట్ వెంచర్లకు, భూస్వాములకు, ప్రభుత్వ ఉద్యోగులకు సైతం ఎలాంటి విధివిధానాలు రూపొందించకుండానే అప్పటి ప్రభుత్వం భూమి పట్టా కలిగిన ప్రతి ఒక్కరికి రైతుబంధు పథకాన్ని అమలు చేసింది. ఈ పథకం ద్వారా జిల్లాలో లక్షా 46వేల మంది రైతులకు 136 కోట్ల రూపాయలను చెల్లిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు పథకాన్ని సవరించి తాము ప్రకటించిన రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని భావించింది. గడిచిన యాసంగి సీజన్‌లో పాత విధానంలోనే రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించింది. వానాకాలం సీజన్ ఆరంభం కావడంతో రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూశారు. కొత్త పథకాన్ని అమలుచేస్తారా, పాత పథకం ప్రకారమే పెట్టుబడి సొమ్మును ఖాతాల్లో జమ చేస్తారా అనే చర్చ రైతుల్లో నడిచింది.

### ● ఖరారు కాని మార్గదర్శకాలు..

రైతుభరోసా కింద పెట్టుబడి సాయం ఇచ్చే దానికంటే ముందే ఆగస్టు 15వ తేదీ వరకు రైతులకు 2 లక్షల రూపాయల వరకు రుణ మాఫీ పథకాన్ని అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రకటించారు. జూన్ 21న జరిగిన మంత్రి మండలి సమావేశంలో కూడా ముందుగా రుణ మాఫీ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. రైతు భరోసా పథకాన్ని అమలు చేసేందుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సభ్యులుగా ఉప సంఘాన్ని నియమించారు. ఈ ఉప సంఘం రైతు సంఘాలు, రైతు కూలీ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, వివిధ వర్గాల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి జూలై 15లోపు నివేదిక అందజేయాలని ప్రభుత్వం పేర్కొంది. ఈమేరకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో రైతులతో సమావేశాలు నిర్వహించి రైతుల నుంచి రైతు భరోసా పథకం అమలు గురించి అభిప్రాయ సేకరణ చేశారు. ఆ తర్వాత మంత్రివర్గ ఉప సంఘం ఉమ్మడి జిల్లాల వారీగా రైతులు, రైతు సంఘాల నాయకులు, వివిధ వర్గాలతో సమావేశాలు నిర్వహించి అభిప్రాయ సేకరణ చేశారు. ఈ పథకాన్ని 10 ఎకరాల వరకు పరిమితం చేయాలని కొందరు, 5 ఎకరాల వరకే ఇవ్వాలని కొందరు, రహదారులు, కొండలు, గుట్టలు, బంచరాయి భూములు, సాగుకు యోగ్యం కానీ భూములు, ప్రజాప్రయోజనాల కోసం ప్రభుత్వం సేకరించిన భూములు కలిగిన వారికి, ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వవద్దని కొందరు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. వీటిపై మంత్రివర్గ ఉప సంఘం నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అప్పగించిన తర్వాత అసెంబ్లీ సమావేశాల్లో చర్చ పెట్టాల్సి ఉంది. ప్రభుత్వం రుణ మాఫీ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయడంపై దృష్టి సారించింది. మొదటి విడతలో లక్ష రూపాయల వరకు, రెండవ విడతలో లక్షా 50 వేల రూపాయల వరకు మాఫీ చేసింది. జిల్లాలో రెండు విడతల్లో 42,962 మంది రైతులకు 271 కోట్ల 85 లక్షల రూపాయలు మాఫీ చేశారు. రుణ మాఫీ అందరికి కాకపోగా, కనీసం రుణ మాఫీ అయినా అందుతుందోనని రైతులు ఎదురు చూస్తున్నారు. ఆగస్టు 2 వరకు నడిచిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రైతుభరోసా అంశం చర్చకు రాకపోవడంతో ఈ వానాకాలం సీజన్‌కు రైతులకు పెట్టుబడి సాయం అందే అవకాశాలు కనబడడం లేదు.

## తహసీల్దార్ కార్యాలయ నూతన భవనం ప్రారంభం



తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 8 : పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న నూతన భవనాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం తహసీల్దార్ కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చడం జరిగిందని, ఇకనుంచి తహసీల్దార్, జాయింట్ సబ్ రిజిస్టర్ సేవలు నూతన భవనం నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, మండల తహసీల్దార్ రాజ్‌కుమార్, ఆర్‌ఐలు భానుతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దపల్లి ఎంసీహెచ్ కేంద్రంలో స్కానింగ్ సేవలు..

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 8: మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రంలో గర్భిణులకు టిఫ్ఫా స్కానింగ్ సేవలు ప్రారంభిస్తున్నామని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ సంచాలకులు ఆర్వీ కర్ణన్, కలెక్టర్ ఆదేశాల మేరకు మాతాశిశు సంరక్షణ కేంద్రంలో టిఫ్ఫా స్కానింగ్ కేంద్రాన్ని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ గురువారం ప్రారంభించారు. అనంతరం మంథని ప్రభుత్వ ఆసుపత్రికి మెడికల్ సూపరింటెండెంట్‌గా నూతనంగా నియమితులైన డాక్టర్ రాజశేఖర్, ఆర్ఎంవో డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులకు అవసరమైన స్కానింగ్ నిర్వహించేందుకు టిఫ్ఫాస్కానింగ్ యంత్రాలు ఉపయోగపడతాయని, పెద్దపల్లి మాతా శిశుసంరక్షణ కేంద్రంలో ఏర్పాటుచేసిన యంత్రాన్ని అవసరమైన గర్భిణులు వినియోగించుకోవాలని, ఉచితంగా స్కానింగ్ చేయడం జరుగుతుందని, బయట స్కానింగ్ చేయించుకొని డబ్బులు ఖర్చు చేసుకోవద్దని కలెక్టర్ పిలుపునిచ్చారు. డాక్టర్ వాసుదేవరెడ్డి, డాక్టర్ రవీందర్, డాక్టర్ సుప్రియ, డాక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో దారి పునరుద్ధరణ



బ్రాహ్మణపల్లిలో రైతుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 8 : పెద్దపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు ఉన్నా దారిని ఓ రైతు దుక్కి దున్ని నాటు వేయడంతో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చొరవతో రైతుతో మాట్లాడి రోడ్డును పునరుద్ధరణ చేశారు. గత కొంతకాలంగా రైతులు దారి వెంటే తమ పంట పొలాలకు దారి ఉండగా రోడ్డును ఆక్రమించి నాటు వేయడం తో అధికారుల కు పలుమార్లు ఫిర్యాదు చేసారు. స్పందించిన అధికారులు రోడ్డును సర్వే నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదికను సమర్పించారు. అయినా కూడా రోడ్డు సమస్య పరిష్కారం కాకపోవడంతో కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా గురువారం ఎమ్మెల్యే విజయరమణారావు గ్రామానికి వచ్చి సంబంధిత రైతుతో మాట్లాడారు. ఎమ్మెల్యే హమీతో వివాదం సద్దుమణిగింది. దీంతో తిరిగి రోడ్డును ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. వెంట పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, బసంత్‌నగర్ ఎస్సై స్వామి, మాజీ సర్పంచ్‌లు గాండ్ల మల్లేశం, బొల్లం తిరుపతి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## జూలపల్లిలో కుక్కల భయం..



జూలపల్లిలో రోడ్డుపై కుక్కల సంచారం..

జూలపల్లి, ఆగస్టు 8 : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువైంది. మీదపడి దాడులు చేసి కరవడంతో భయంతో వణికిపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడచూసిన కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ కనిపిస్తున్నా, వాటిని నియంత్రించే వారు లేకపోవడంతో రోడ్లపై వచ్చిపోయే ప్రయాణికులపై దాడులు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## మూడో రోజూ విధులు బహిష్కరించిన న్యాయవాదులు

- గోదావరిఖని పట్టణంలో బైక్ ర్యాలీ - సీపీకి వినతి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

కోల్‌సిటీ, ఆగస్టు 8: ఆలేరు జనగామలో న్యాయవాదులు అమృతరావు, కవితలపై అక్కడి పోలీసులు దురుసుగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ తెలంగాణ అడ్వకేట్ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం మూడో రోజు కూడా గోదావరిఖని కోర్టుల్లో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. అనంతరం మున్సిఫ్ కోర్టు కాంప్లెక్స్ ఎదుట నిరసన తెలిపారు. న్యాయవాదులపై దురుసుగా ప్రవర్తించిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేసి విచారణ జరుపాలని డిమాండ్ చేశారు. పోలీసుల ఆగడాలను అందరూ ఖండించాలన్నారు. న్యాయవాదులపై పోలీసుల దుశ్చర్యపై ప్రభుత్వం విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కోర్టు నుంచి కమిషనరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం సీపీ శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. న్యాయవాదుల విధుల బహిష్కరణతో అన్నీ కోర్టుల్లో విధులు నిలిచిపోయాయికీ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు తొటం సతీష్, జవ్వాజి శ్రీనివాస్, గుర్రం నారాయణ, పులిపాక ప్రవీణ్, గోషిక ప్రకాష్, లింగస్వామి, చందాల శైలజ, పూర్మ శ్రీనివాస్, వేల్పుల మురళిధర్‌యాదవ్, దేశెట్టి అంజయ్య పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ ఉద్యోగుల సమ్మె



సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ ఉద్యోగులు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 8: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గురువారం జీపీ ఉద్యోగులు ఒక్కరోజు సమ్మె నిర్వహించారు. తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగులు సీఐటీయూ పిలుపు మేరకు బందు పాటించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ధర్నా నిర్వహించారు. ఉద్యోగులకు నెల నెల జీతాలు ఇవ్వాలని, ప్రభుత్వం జీతాలు పెంచి ఆదుకోవాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు, జీపీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## గత ప్రభుత్వ హయాంలో రైతులకు తీవ్ర నష్టం..

- ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల, ఆగస్టు 8: గత ప్రభుత్వ హయాంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం 147మందికి రూ.36.79లక్షల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కేసీఆర్ పాలనలో సన్నరకం వరి ధాన్యం పండించాలని షరతులు విధిస్తే పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి పాలనలో సన్న రకానికి రూ.500 బోనస్ ప్రకటించి రైతులకు భరోసా కల్పించారని అన్నారు. ఓదెల నుంచి పెగడపల్లి వరకు రూ.16కోట్లతో రోడ్ల పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మల్లన్న క్షేత్రం పరిసరాల్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేస్తామని, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, ఆళ్ల సుమన్‌రెడ్డి, బైరి రవీందర్, గుండేటి ఐలయ్య, గోపు నారాయణరెడ్డి, ఢిల్లీ శంకర్, పడాల రాజు, బోడకుంట శంకర్, చొప్పరి రాజన్న, రెడ్డి రజనీకాంత్, గిరాం సాంబమూర్తి, తిప్పారపు సంపత్, అంబాల కొమురయ్య, బొంగోని శ్రీనివాస్, కోట నిరంజన్‌రెడ్డి, ఎంపీడీవో తిరుపతి, ఎమ్మార్వో యాకయ్య, ఎంపీవో షబ్బీర్ పాష పాల్గొన్నారు. ఓదెల నుంచి హరిపురం వైపు వెళ్లే బైపాస్ రోడ్డు పక్కన ఉన్న శ్మశానంలో బోరువెల్‌ను ప్రారంభించారు. అలాగే హైస్కూల్ ఆవరణలో స్వచ్ఛదనం, పచ్చదనంలో భాగంగా ఎమ్మెల్యే మొక్కలు నాటారు. పురగిరి క్షత్రియపెరిక సంఘం భవనం వద్ద అభివృద్ధి పనులకు రూ.5లక్షలు, కాపు సంఘం కమిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు ఉద్యమించాలి

- ప్రజా పంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా పంథా నాయకులు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 8: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదిద్దామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజా పంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. జూపాక శ్రీనివాస్ మాట్లాడుతూ రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు, ఇళ్లు, ఇళ్ళ స్థలాలు తదితర అనేక సమస్యల పరిష్కారం కోసం పేద ప్రజలు సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్నారన్నారు. పిల్లలు పెరిగి పెద్దవారై, పెళ్లిళ్లు అయి వేరుగా ఉండి కాపురాలు చేసుకుంటున్నా వారికి రేషన్ కార్డులు జారీ కావడం లేదన్నారు. ఆరు గ్యారంటీలు, ఇంకా ఎన్నో హామీలు మానిఫెస్టోలో ప్రకటించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు పూర్తి కావస్తున్నదని, హామీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. రైతుల, వ్యవసాయ కార్మికుల, విద్యార్థుల, యువజనుల, మహిళల తదితర అన్ని వర్గాల ప్రజలు సమస్యలు ఎన్నో ఉన్నాయన్నారు. అన్ని రకాల పంటలకు బోనస్ ఇవ్వాలని పాత, కొత్త రుణాలు మాఫీ చేయడంతో పాటు కొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ కార్మికుల కోసం చట్టం అమలు చేయాలని, వారికిస్తానన్న 12 వేల పెన్షన్ కూడా అమలు చేయలేదని, నిరుద్యోగ ఖాళీలన్నింటిపై శ్వేత పత్రం ప్రకటించి వారికి క్యాలెండర్ ప్రకటించి భర్తీ చేయాలన్నారు. విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎన్నో ఏళ్ళుగా పెండింగ్‌లో ఉన్నాయని వాటిని విడుదల చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో గుజ్జుల సత్యనారాయణరెడ్డి, తోకల రమేష్, గుమ్మడి వెంకన్న ఆడెపు శంకర్, మార్త రాములు, గొల్లపల్లి చంద్రయ్య, పెండ్యాల రమేష్, కోడిపుంజుల లక్ష్మి, కట్ట తేజేశ్వర్, అంగడి కుమార్ బడావత్ సన్నీ మార్త రాద, బండి అశోక్‌గౌడ్, తిగుట్ల నవీన్, గోర్క శ్రీనివాస్‌గౌడ్, కందుల రాజయ్య, పొన్నగంటి రాజయ్య, అందె సతీష్, కలవల రాయమల్లు, నాని జానీ, దోత్తుల హనుమయ్య, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

# ఖనిలో విజృంభిస్తున్న విష జ్వరాలు

- కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు - రోజుకు 300లకు పైగా ఓపీ కేసులు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు



ఓపీ వద్ద రోగులు, వారి బంధువులు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 8: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. పలుచోట్ల వర్షం నీరు నిల్వడంతో దోమలు, ఈగలు పెరిగిపోయి టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, వైరల్ ఫీవర్ విస్తృతంగా వ్యాప్తిచెందుతున్నాయి. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పాటు పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. ప్రతి రోజు సుమారు 300 మంది టైఫాయిడ్, వైరల్ ఫీవర్‌తో వస్తున్నారు. ఆసుపత్రిలో వివిధ కౌంటర్ల వద్ద రోగులు బారులు తీరారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రామగుండం, కమాన్‌పూర్, మంథని, పాలకుర్తి, అంతర్గాం మండలాలతో పాటు భూపాలపల్లి జిల్లా నుంచి రోగులు పెద్ద సంఖ్యలో వైద్యం కోసం వస్తున్నారు. ఇందులో కొంత మందికి ప్లేట్‌లెట్స్ తగ్గి రక్తకణాలు పడిపోవడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్, హైదరాబాద్ వంటి నగరానికి వెళుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కాలువలు, కుంటలు పొంగి పొర్లి చాలా చోట్ల భూగర్భ డ్రైనేజీ సక్రమంగా లేకపోవడంతో చెత్త పేరుకుపోవడం, దోమలు, ఈగలు వ్యాప్తి చెందడంతో అంటు వ్యాధులు విజృంభిస్తున్నాయి. రామగుండం కార్పొరేషన్‌లో ఎక్కడ చూసినా పారిశుధ్యం లోపించడంతో చర్యలు చేపట్టకపోవడంతో దోమల వ్యాప్తి పెరిగిపోయింది. పలు కాలనీల్లో దోమల మందు, బ్లీచింగ్ పౌడర్ చల్లాల్సి ఉండగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. రోడ్లపై చాలా చోట్ల నీళ్లు నిలిచి ఉండడం, దోమల వ్యాప్తి పెరిగిపోతుంది. నిల్వ నీరు వెళ్లేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా రామగుండం కార్పొరేషన్‌లో అస్తవ్యస్తంగా మారిన పారిశుధ్య నిర్వహణను సక్రమంగా చేపట్టాలని పలువురు రామగుండం కమిషనర్‌ను కోరుతున్నారు.

### చిన్నపిల్లల్లో బ్లడ్ ఇన్‌ఫెక్షన్

ప్రైవేట్ ఆసుపత్రులు చిన్న పిల్లలతో కిటకిటలాడుతున్నాయి. చాలా మంది పిల్లల్లో బ్లడ్ ఇన్‌ఫెక్షన్, వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోజుకు 50మంది చిన్నపిల్లలు బ్లడ్ ఇన్‌ఫెక్షన్, వాంతులు, విరేచనాలతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు.

## జ్వర బాధితులను పరామర్శించిన మాజీ మంత్రి కొప్పుల



బాధితులను పరామర్శిస్తున్న కొప్పుల ఈశ్వర్

ధర్మారం, ఆగస్టు 8: మండలంలోని పత్తిపాకలో కొద్ది రోజులుగా విషజ్వరాలతో బాధపడుతున్న పలువురు బాధితులను గురువారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. ప్రతి ఇంటిలోని ప్రజలు విషజ్వరాలతో బాధపడుతూ వైద్యం కోసం అప్పులు చేసి లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాణాంతక విషజ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. వెంటనే గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన వైద్య పరీక్షలు చేసి వారికి ఉచితంగా మందులు అందించి వారి ప్రాణాలను కాపాడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట పలువురు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## 'మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం చేసుకోవద్దు'

చిగురుమామిడి,అగస్టు 8: బంగారు భవిష్యత్ ఉన్న విద్యార్థులు మాదక ద్రవ్యాలు వాడి జీవితాలను నాశనం చేసుకోవద్దని తిమ్మాపూర్ సిఐ అన్నారు. గురువారం మండలంలోని చిన్నముల్కనూర్ గ్రామంలో గల మోడల్ స్కూల్‌లో సైబర్ క్రైమ్, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్‌క్రైమ్‌కు గురైతే వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేయలన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలపై అయితే 100 నెంబర్ కాల్ చేయాలన్నారు. ఉన్నతమైన చదువులు చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఎస్సై బండి రాజశే, పాఠశాల ప్రిన్సిపాల్ ఉన్నారు.

## యువతి ఆత్మహత్య

తిమ్మాపూర్, ఆగస్టు8: మండలంలోని పోరండ్ల గ్రామంలో ఓ యువతి ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోరండ్ల గ్రామానికి చెందిన మామిడి మొగిళి గ్రామంలో హోటల్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. చిన్న కూతురు మామిడి అఖిల(20) యంఎల్‌టి చదివింది. గురువారం మధ్యాహ్నం అఖిల హోటల్ వద్దకు వచ్చి మధ్యాహ్నం 2గంటల వరకు తల్లితో మాట్లాడి ఇంటికి వెళ్లింది. తరువాత కొద్ది సేపటికి సుమారు 3.30గంటల సమయంలో తల్లి కుతురు అఖిలకు ఫోన్ చేయగా ఫోన్ ఎత్తకపోవడంతో తల్లి ఇంటికి వెళ్లింది. ఇంటికి వెళ్లి చూసే సరిగి ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని కనిపించింది. స్థానికులు వచ్చి అఖిలను కిందికి దింపి చూడగా అప్పటికే అఖిల మృతి చెందింది. అయితే తన కూతురు చనిపోయే ముందు ఒక పుస్తకంలో అంగోతు భరత్, అంగోతు కోటయ్య, అంగోతు విజయలు ఫోన్‌లో వేధింపులకు గురిచేశారని, ఆర్థికంగా కూడా ఇబ్బందులకు గురి చేసినందుకుగాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు, తన చావుకు వారే కారణం అని రాసిందని తెలిపారు. తన కూతురు చావుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని తండ్రి మొగిళి పోలీసులకు ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు వారు తెలిపారు.

## ఇంటింటా జ్వర సర్వే

చొప్పదండి, ఆగస్టు 8: స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా చొప్పదండిలో వైద్యశాఖ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటా జ్వర సర్వే నిర్వహించారు. ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అధికారులు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో డెంగ్యూ, మలేరియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, మేనేజర్ ప్రశాంత్ కుమార్, కౌన్సిలర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్
# మరో ఆరు నెలలు పొడిగింపు

జమ్మికుంట, ఆగస్టు 8: జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో యశ్వంత్‌పూర్-గోరఖ్‌పూర్, గోరఖ్‌పూర్-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ గడువును మరో ఆరు నెలల పాటు పొడిగిస్తున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ శ్రీధర్ గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. జమ్మికుంటలో జనవరి 29న యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్ మొదలైన విషయం తెలిసిందే. ప్రయోగాత్మకంగా ప్రారంభించిన హాల్టింగ్‌కు అనుకున్న విధంగా ప్రయాణికుల నుంచి స్పందన రాలేదు. దీంతో ఈ నెల 10వ తేదీ నుంచి హాల్టింగ్‌ను మరో ఆరు నెలల పాటు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

## వారణాసిలో వేములవాడ సత్రం ప్రారంభం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 8: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వారణాసి (కాశీ) క్షేత్రంలో శ్రీరాజరాజేశ్వర క్షేత్ర ఆర్యవైశ్య వాసవి నిత్యాన్న సత్ర సంఘం వేములవాడ ఆధ్వర్యంలో వేములవాడ సత్రం ఏర్పాటు చేసింది. గురువారం వారణాసిలోని ఓ అద్దె భవనంలో సత్రం కమిటీ అధ్యక్షుడు, కరీంనగర్‌కు చెందిన వ్యాపారవేత్త బుస్సా శ్రీనివాస్ దంపతులచే పూజలు చేసి వేములవాడ సత్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ సత్రం ఉపాధ్యక్షుడు ఉప్పల రామేశం, బుస్సా దశరథంతో పాటు పలువురు దాతలు, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుస్సా శ్రీనివాస్ మాట్లాడుతూ 18 డీలక్స్ రూమ్‌లతో ఉన్న అద్దె భవనంలో తాత్కాలికంగా వేములవాడ సత్రంను ప్రారంభించామని, శాశ్వత భవన నిర్మాణం కోసం ఇప్పటికే దాతలు ఇచ్చిన విరాళాలతో స్థలం కొనుగోలు చేశామని, శుక్రవారం భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తామని చెప్పారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి వారణాసి క్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం చక్కటి వసతితోపాటు తెలంగాణ రుచులతో కూడిన భోజనం కూడా కల్పించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బుస్సా శ్రీనివాస్ కోరారు.

## ఇసుక డంప్ సీజ్

సుల్తానాబాద్, ఆగస్టు 8: మండలంలోని గర్రెపల్లి సమీపంలోగల ఓ వ్యవసాయ భూమిలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి గురువారం తెలిపారు. డంప్ వద్ద ఉన్న దాదాపు ఇరవై ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అక్రమంగా ఇసుక తరలింపు కానీ, డంప్‌లు కానీ ఏర్పాటు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## బీఎస్సీ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఆగస్టు 8: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జూన్ 2024లో నిర్వహించిన బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్ రెండో సెమిస్టర్) పరీక్షల ఫలితాలను యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగ ప్రసాద్ గురువారం విడుదల చేశారు.

# ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట, ఆగస్టు 8: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. గురువారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 8,816 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల నుంచి మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 121 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.935 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. మిడ్ మానేరు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 17.15 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.24టీఎంసీల నీరు ఉంది. మిడ్ మానేరు ద్వారా 6,400 క్యూసెక్కుల నీటిని రెండు మోటార్ల ద్వారా ఎత్తిపోస్తుండగా రంగనాయకసాగర్‌కు 6,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.


ఎస్సారెస్పీ ప్రాజెక్టు

### ● ఎస్సారెస్పీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

జగిత్యాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు అధికారులు మూడు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గురువారం ఎస్సారెస్పీలోకి 6,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 47.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువకు మూడు వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు వంద క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 50 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

## దోస్త్ స్పెషల్ ఫేజ్ సీట్ల కేటాయింపు పూర్తి

గణేశ్‌నగర్, ఆగస్టు 8: శాతవాహన విశ్వవిద్యాలయంలో దోస్త్ స్పెషల్ ఫేజ్ సీట్లలో ఉన్నత విద్యా మండలి శాతవాహన యూనివర్సిటీ పరిధిలో మొత్తం 3,157 సీట్లను కేటాయించిందని శాతవాహన యూనివర్సిటీ దోస్త్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత తెలిపారు. మొత్తం మూడు ఫేజ్‌లకు 15,950 సీట్లు కేటాయించగా 11,848 మంది విద్యార్థులు కళాశాలలో రిపోర్ట్ చేశారన్నారు. స్పెషల్ ఫేజ్‌లో 3157 సీట్లలో ప్రభుత్వ కళాశాలలో 440మంది విద్యార్థుల సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. రెండు ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో 451మంది విద్యా ర్థులకు, ప్రైవేటు కళాశాలల్లో 2266 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. స్పెషల్ ఫేజ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు శుక్రవారం ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి సీటు రిజర్వ్ చేసుకోవాలని లేనిపక్షంలో సీటు రద్దు అవుతుందని తెలిపారు.

## అనారోగ్యంతో ఆత్మహత్య

జగిత్యాలరూరల్, ఆగస్టు 8: జగిత్యాల పట్టణంలోని సాయిరాంనగర్‌కు చెందిన రామస్వామి (54) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు టౌన్ ఎస్సై మన్సూర్‌ఖాన్ తెలిపారు. రామస్వామి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మనస్థాపానికి గురై తన ఇంట్లో తాను నిద్రిస్తున్న మంచానికి నిప్పు అంటించుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మన్సూర్‌ఖాన్ తెలిపారు.

# గౌరవెల్లి రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

చిగురుమామిడి, ఆగస్టు 8: గౌరవెల్లి రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని, హుస్నాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉన్న ప్రజల సమస్యలను పరిష్కరించాలని గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అధ్వర్యంలో కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ఢిల్లీలో కలిసి విన్నవించారు. నేషనల్ హైవే రోడ్డు పనుల్లో కొంత మార్పులు చేయలని కోరినట్లు తెలిపారు. డివైడర్‌తో పాటు 4 వరుసల రోడ్డు వేయాలన్నారు. అంతకపేట నుండి కొత్తకొం డ వరకు నిర్మాణం చేయనున్న రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని అందుకు సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఎగువ ప్రాంతమైన కన్నారం, గండిపల్లి, కట్కూర్, కన్నా రం, ప్రాంతలకు సాగునీరు అందించెందుకు ఏర్పాట్లు జరిగెలా కృసి చేయలని కోరినట్లు తెలిపారు. తాము విన్నవించిన అనేక సమస్యలపై మంత్రి సానూ కులంగా స్పందించినారని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. మరిన్ని నిధులు మంజూరు చేసి అన్ని గ్రామాల్లో పూర్తిగా అబివృద్ధి పనులు జరిగేలా మంత్రి ప్రత్యేక కృషి చేస్తారని తెలిపారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మండల బీజేపీ మండల అద్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి, కుట్కూర్ గ్రామ మాజీ సర్పంచ్ జిల్లె అశోక్‌రెడ్డి, చందుపట్ల నాగరాజు, లతో పాటు తదితరులు ఉన్నారు.


కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో సమావేశమైన నాయకులు

# భోజన్నపేటలో కుక్కల దాడి

● నలుగురికి గాయాలు
● నివారణ చర్యలు చేపట్టని అధికారులు

పెద్దపల్లి రూరల్ , ఆగస్టు 8 : పెద్దపల్లి మండలంలోని గ్రామాల్లో కుక్కల దాడి అధికమవుతోంది. మండలంలోని భోజన్నపేటలో గురువారం నలుగురు వ్యక్తులతో పాటు లేగదూడపై పిచ్చికుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రులకు తరలించారు. ప్రతి రోజు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, మహిళలు దాడి చేసిన వైనాన్ని చూసి అందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అయినప్పటికీ గ్రామాల్లో కుక్కల బెడదను నివారించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

### ఎల్లారెడ్డిపేటలో ఆరుగురు విద్యార్థులకు...

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 8: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం కుక్కలు దాడి చేసిన సంఘటనలో ఆరుగురు విద్యార్థులు తీవ్ర గాయాలపాలయ్యారు. గ్రామానికి చెందిన విద్యార్థులు మస్కూరి బ్రిటిష, మస్కూరి సహస్ర, ఏర్పుల వరుణ్, మద్దుల వర్షిత్ రెడ్డి, రాగుల రిత్విక, గుండం హనీష్ పాఠశాల నుంచి సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. ఆరుబయట హోంవర్క్ చేస్తున్న విద్యార్థులపై కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. తీవ్ర గాయాల పాలైన విద్యార్థులను మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. పలుమార్లు దాడి చేసి గాయపరిచినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి కుక్కల బారి నుంచి తమకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

## 11న ఉమ్మడి జిల్లా మహిళల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 8: ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఈ నెల 11న ఉమ్మడి జిల్లా మహిళల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డబ్ల్యూ గణపతి తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ చాటే మహిళా క్రీడాకారులను ఈనెల 16 నుంచి నిజామాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. 2008కి ముందు జన్మించిన క్రీడాకారులు ఆధార్ కార్డు జిరాక్సుతో జనన ధ్రువీకరణ పత్రంతో పాటు నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో జిల్లా ఉపాధ్యక్షుడు అంతటి శంకరయ్యకు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్:9849114956 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## ఇసుక టాక్టర్ పట్టివేత

వీణవంక,ఆగస్టు8:మండలంలోని రెడ్డిపల్లిలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా కొర్కల్ గ్రామంలోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నా టాక్టర్‌ను పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్ తరలించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ అంబాల రాజ్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు.

# మద్యం మత్తులో స్నేహితుడి హత్య

● డీఎస్పీ రఘుచందర్

కొడిమ్యాల, ఆగస్టు 8 : మద్యం మత్తులో స్నేహితుడినే హత్య చేసిన సంఘటనలో ఇద్దరు నిదితులను అరెస్ట్ చేసినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ వెల్లడించారు. గురువారం కొడిమ్యాల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు తెలిపారు. ఈ మేరకు పూడూర్ గ్రామానికి చెందిన మామిడి కమల్, మల్యాల మండలం గొర్రెగుండం గ్రామానికి చెందిన చిలువేరి తిరుపతి మృతుడు కందుల రాజశేఖర్‌తో మద్యం సేవించారు. మద్యం తాగుతున్న సమయంలో పాత గొడవల ప్రస్తావన వచ్చిందన్నారు. అదే సమయంలో రాజశేఖర్‌తో కమల్, తిరుపతి గొడవపడుతు కర్రతో తలపై కొట్టారన్నారు. రాజశేఖర్ అరుస్తుండగా నోటిలో ఇసుక పోసినట్లు డీఎస్పీ వివరించారు. హత్య చేసి సాక్ష్యాలను ధ్వంసం చేసేందుకు గాను మృతుడి స్కూటీ నుంచి పెట్రోలు తీసి కాల్చారన్నారు. నిందితులు ఇద్దరు కరీంనగర్ పారిపోతుండగా పూడూర్ గ్రామ శివారులో పట్టుకున్నట్లు తెలిపారు. ఇద్దరు నిందితుల వద్ద నుండి రక్తం మరకలు ఉన్న బట్టలు, సెల్, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాలుగు రోజులో హత్య కేసు చేదించిన మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్, పోలీసులను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

# రుణమాఫీకి కాంగ్రెస్ కొర్రీలు

● కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 8 : ఎన్నికల ముందు షరతులు లేకుండా రెండు లక్షలలోపు మూడు దఫాల్లో రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత అమలుకు సవాలక్ష ఆంక్షలు పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమాన్ని పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి నేతృత్వంలో గురువారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో నిర్వహించగా పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ, కోడిపల్లి గోపాల్‌రెడ్డిలతో కలిసి ఆయన హాజరయ్యారు. రుణమాఫీ గురించి గ్రామాల్లోని రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 65లక్షల పాస్ బుక్‌లు ఉంటే ఎంత మందికి రుణమాఫీ చేస్తున్నారో తెలిపాలని, అదే విధంగా రైతు భరోసా రూ.15వేలు సంవత్సరంలోపు ఇస్తామన్న హామీ నేరవేర్చకుండా రైతు పసల్ బీమా యోజన, ధాన్యానికి క్వింటాలకు రూ. 500ల బోనస్ ఇవ్వడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు పార్టీ కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు మారు జనార్ధన్‌రెడ్డి, భోగ గంగాధర్, బోడ్ల రమేష్, వడ్డేపల్లి శ్రీనివాస్, సుఖేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలపై సిబ్బంది తక్షణమే స్పందించాలి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 8: విద్యుత్ సమస్యలు ఉంటే సిబ్బంది తక్షణమే స్పందించాలని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ గంగాధర్ అధికారులు, సిబ్బందికి సూచించారు. జిల్లా కేంద్రంలో విద్యుత్ శాఖ డీఈలు, ఏడీలు, ఏఈలు, ఏఏఓలు, సబ్ ఇంజనీర్లు ఇతర విద్యుత్ అధికారులతో ఎస్ఈ గంగాధర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు ఉన్న ప్రతిచోట సిబ్బంది తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. సిబ్బంది పనిచేస్తున్నపుడు అన్ని రక్షణ పరికరాలు వాడి, విద్యుత్ ప్రమాదాల భారిన పడకుండా రోజు ఉదయం సెక్షన్ ఆఫీస్ వద్ద పెప్‌టాక్ సమావేశంలో ప్రతిజ్ఞ చేయించాలని తెలిపారు. ప్రతినెల టార్గెట్ ప్రకారం విద్యుత్ బిల్లులు వసూలు చేసి వినియోగదారులకు కావలిసిన అభివృద్ది పనులకు వినియోగించుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అన్ని వ్యవసాయ సర్వీస్‌లకు కావల్సిన పోల్‌లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు సామాగ్రి వెంటనే ఏర్పాటు చేసి సర్వీసులు రిలీజ్ చేయాలని ఆదేశించారు. సబ్‌స్టేషన్‌లు, లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు నిర్వహణ వివరాలను ఆన్‌లైన్ మొబైల్ ఆప్‌లో పొందుపర్చాలని ఆదేశించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్ఇ గంగాధర్

## ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా జగిత్యాల వాసి


వెల్మల భరత్

జగిత్యాల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా జగిత్యాల జిల్లా వాసి నియమితులయ్యారు. జగిత్యాల జిల్లా మేడిపెల్లి మండలం కట్లకుంట గ్రామానికి చెందిన వెల్మల భరత్ పదో తరగతి వరకు గ్రామంలోనే చదివారు. ఇంటర్, డిగ్రీ జగిత్యాలలోని ప్రభుత్వ కళాశాలలో చదివారు. 2015లో న్యాయవిద్యలో పట్టా అందుకొని అదే సంవత్సరం న్యాయవాదిగా హైకోర్టులో ప్రాక్టీసు మొదలుపెట్టాడు. గతంలో హైకోర్టు న్యాయవాదుల సంఘంలో కార్యనిర్వాహక సభ్యునిగా సేవలందించిన భరత్ ప్రస్తుతం హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డికి, అడిషనల్ అడ్వకేట్ జనరల్ రజినీకాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా భరత్ నియామకం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## నాటుసారా తయారు చేస్తున్న ఇద్దరి అరెస్టు


ఇద్దరిని అరెస్టు చేసిన ఎక్సైజ్ సీఐలు

సుల్తానాబాద్, ఆగస్టు 8: నాటు సారాయితో పాటు, సారాయి తయారీ కోసం తీసుకువెలుతున్న ఇతర పదార్థాలను పట్టుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు సుల్తానాబాద్ ఎక్సైజ్ సీఐ రఘునాథ్ రాథోడ్ తెలిపారు. సుల్తానాబాద్ పట్టణంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ముందు గురువారం నిందితుల అరెస్టు చూపుతూ పదిహేను లీటర్ల సారాను, సారా తయారీ కోసం ఉపయోగించే వంద కిలోల బెల్లంను, పది కేజీల పటికను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ గురునాథ్ మాట్లాడుతూ వీణవంక మండలం నుంచి కాల్వశ్రీరాంపూర్ మండలం పందిళ్ల గ్రామానికి టాటా ఏసీ వాహనంలో గంట సారయ్య, బండి అఖిల్ అనే ఇద్దరు వ్యక్తులు వీటిని తరలిస్తుండగా తాము వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారని వివరించారు. ఈ మేరకు సుల్తానాబాద్ ఎక్సైజ్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని అన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ కె ఎస్ ఎన్ రాజు, సిబ్బంది బీర్బల్, మహేందర్, సంతోష్ తదితరులు ఉన్నారు.

## విద్యుదాఘాతంతో ఒకరి మృతి


కందాల శ్రీనివాస్(ఫైల్)

ఇల్లందకుంట, ఆగస్టు 8: ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన కందాల శ్రీనివాస్ (42) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ తన నివాసంలో సంపు హౌజ్‌లోని చిన్న మోటర్‌ను మరమ్మతు చేసేందుకు పైకి లాగి మోటర్‌ను అందుకునే సమయంలో ప్రమాదవశాత్తు మోటర్‌కు షార్ట్ సర్క్యూట్ కావడంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య నవత, ముగ్గురు పిల్లలున్నారు. మృతుడి భార్య నవత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

## పొలంలో పడి వ్యక్తి మృతి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 8: మండలంలోని మూలసాల గ్రామానికి చెందిన నర్ర సమ్మయ్య (48) అనే రైతు ప్రమాదవశాత్తు పొలంలో పడి ఊపిరాడక మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి కాలు జారి పొలంలో పడిపోవడంతో మొహం పూర్తిగా బురదలో ఉండటంతో ఊపిరాడక మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

## చికిత్స పొందుతూ యువతి మృతి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 8: మండలంలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన చింతపండు ఝాన్సీరాణి (19) అనే యువతి చికిత్స పొందుతూ మృతిచెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత కొంతకాలంగా యువతి కడుపునొప్పితో బాధపడుతుండేది. నొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటికీ వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి చింతపండు సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్వామి తెలిపారు.

## బెదిరించిన వ్యక్తిపై కేసు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 8: చిట్టుమల్ల శ్రీనివాస్ అనే వ్యాపారవేత్తపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ, దూషి స్తూ చంపుతానని బెదిరింపులకు పాల్పడిన కరీంనగర్ వాసవీకాలనీకి చెందిన నీరుమల్ల శ్యాంసుందర్‌పై కేసు నమోదు చేశామని కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు తెలిపారు. కరీంనగర్‌కు చెందిన వ్యాపారవేత్త చిట్టుమల్ల శ్రీనివాస్‌కు పదేపదే ఫోన్ చేసి బూతులు తిడుతూ, చంపుతానని ఫోన్‌లో బెదిరించడంతో పాటు వాట్సాప్ గ్రూపులలో అసభ్య పదజాలంతో దూషిస్తూ పోస్టులు పెట్టిన నీరుమల్ల శ్యాంసుందర్‌పై బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కోర్టు అనుమతితో నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# గంభీరావుపేటలో వరుస దొంగతనాలు

గంభీరావుపేట, ఆగస్టు 8: గంభీరావుపేట మండల కేంద్రంలో వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళనతో ఉన్నారు. పక్షం రోజులుగా దొంగలు వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారు. తాళాలు వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. దీంతో ఇళ్లకు తాళాలు వేసి ఇతర గ్రామాలకు వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. ఏ రోజు ఏ ఇంట్లో దొంగతనం జరుగుతుందో.. తెల్లారితే ఏ ఇల్లు లూటీ అవుతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. తాళాలు వేసిన పలు ఇళ్లల్లో ఇటీవల దొంగలు చోరీకి పాల్పడ్డారు. విజయ అనే మహిళ ఇంట్లో తప్ప మిగితా ఇళ్లలో పెద్దగా లూటి జరగలేదు. అయితే విజయ ఇంట్లో బంగారం, వెండి అభరణాలు దొంగలు ఎత్తుకెళ్లారు. విజయ ఇంటి ముందే కేజీటూపీజీకి సంబందించిన సీసీ కెమెరాలు ఉన్నా.. సీసీ కెమెరాలు పనిచేయలేదని తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఓ కాలనీలో దొంగగా బావిస్తున్న ఓ వ్యక్తి చేతిలో ఇనుప సలాక పట్టుకుని ముసుగు ధరించి వెళుతున్న దృశ్యం అక్కడి సీసీ కెమెరాలో స్పష్టంగా కనిపిస్తోంది. ఆ సీసీ కెమెరా పుటేజీ సోషల్ మీడియా వైరల్ అవుతోంది. ఈ దృశ్యం గంభీరావుపేటలోనిదా కాదా ఇంకా స్పష్టం కాలేదు. దొంగలు గంభీరావుపేటలో రాత్రి సమయాల్లో సంచరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. రెండు రోజుల క్రితం కూడ ఎల్లమ్మ కాలనీలో తాళం వేసి ఉన్న శివ అనే వ్యక్తి ఇంటి గోడ దూకారని పోలీస్‌లకు ప్రజలు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీస్‌లు అక్కడికి చేరుకునే సరికి దొంగలు మరో వైపు పరిగెత్తారని తెలిపారు. నిర్ధారణతో పోలీస్‌లు, ప్రజలు కొద్ది దూరం వరకు వెళ్లి వెతికినా దొంగలు దొరకలేదు. ఏదీ ఏమైనా రాత్రి అయిందంటే గంభీరావుపేటలో దొంగల భయం వెంటాడుతోంది. పోలీసు అధికారులు రాత్రి సమయాల్లో మరింత గస్తీ పెంచి, దొంగల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరారు.

## రైతులు సమష్టిగా
# సొసైటీని అభివృద్ధి చేసుకోవాలి

● నాబార్డ్ డిడిఎం జయప్రకాశ్

చిగురుమామిడి,ఆగస్టు 8: రైతులు సమష్టిగా సొసైటీని అభివృద్ధి చేసుకోవాలని నాబార్డ్ డిడిఎం జయప్రకాశ్ అన్నారు. గురువారం మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ గాగిరెడ్డిపల్లి సొసైటీకి ఎఫ్‌పీఓలో మంచి పేరు ఉందన్నారు. రానున్న రోజుల్లో సొసైటీని మరింత అభివృద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు. నాబార్డ్ నుంచి సహకారం ఉంటుందన్నారు. రైతులకు కావాల్సిన సదుపాయాలు అందిస్తామన్నారు. డాక్టర్ వేంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ రైతులు కంపోస్ట్ ఎరువులు వాడాలని అన్నారు. వరి పొలంలో ఎర్ర బొమ్మిడి రోగానికి జింకు వాడాలన్నారు.కార్యక్రమంలో సంఘం చైర్మన్ మంద శ్రీనివాస్, శాస్త్రవేత్తలు, రైతులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు జాతీయ స్థాయి కళోత్సవాలు

జ్యోతినగర్, ఆగస్టు 8: పలు రంగాల ప్రతిభావంతులకు శుక్రవారం తారా ఆర్ట్స్ అకాడమీని నిర్వహిస్తున్న నల్లవజ్రం పురస్కారాలను జయప్రదం చేయాలని ఇప్టా జాతీయ సమితి నాయకుడు కె స్వామి, కళాకారుడు దామెర శంకర్ పిలుపునిచ్చారు. గురువారం జ్యోతినగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంత ప్రజలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మేకల శ్రీధర్ యాదవ్, కళాకారులు మేజిక్ రాజా, దయా నర్సింగ్, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా కాలువ రోడ్డు

సుల్తానాబాద్, ఆగస్టు 8: సుల్తానాబాద్ రైస్‌మిల్లుల ప్రాంతంలోని ఎస్ఆర్ఎస్‌పీ కాలువ రోడ్డు వాహనాల రాకపోకలతో ప్రమాదకరంగా మారింది. కొన్ని రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాల మూలంగా కాలువ రోడ్డు గుంతలమయంగా మారింది. చుట్టూ రైస్‌మిల్లులు ఉండడంతో ఇదే రోడ్డుపై రోజు దాన్యం, బియ్యం బస్తాలతో లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే వర్షాల మూలంగా రోడ్డంతా పాడవడంతో వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నాయి.

## సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 8 : సఖీ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సఖీ కేంద్రం అడ్మినిస్ట్రేటర్ దారుణ స్వప్న అన్నారు. గురువారం మండలంలోని రాఘవపూర్, సబ్బితం గ్రామాల్లో ఉపాధి కూలీలకు సఖీ సేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళ సాధికారిక కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ సుచరిత, ఫీల్డ్ అసిస్టెంట్‌లు సంపత్, రమేష్, ఉపాధి కూలీలు ఉన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

సుల్తానాబాద్, ఆగస్టు 8: తమ సహకార సంఘంలో సభ్యులుగా ఉంటూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు దహన సంస్కారాల నిమిత్తం ఐదు వేల రూపాయల చొప్పున గురువారం అందజేసినట్లు సుద్దాల సహకార సంఘం అధ్యక్షులు గడ్డం మహిపాల్‌రెడ్డి తెలిపారు. సహకార సంఘ సభ్యులుగా ఉన్న ఈగ లచ్చిరెడ్డి, బుర్ర రమాదేవి, గోపిడి రాజారామ్‌లు మృతిచెందారని సంఘం నియమాల ప్రకారం వారి కుటుంబాలకు ఐదు వేల రూపాయల చొప్పున అందించామన్నారు. సహకార సంఘం ఉపాధ్యక్షుడు డిల్లేశ్వర్‌రావు, డైరక్టర్లు, సీఈవో పెర్క సతీష్ పాల్గొన్నారు.

## యువతికి సన్మానం

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 8 : మండలంలోని పెద్దబొంకూరు గ్రామానికి చెందిన మౌనిక పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగం సాధించగా గురువారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సన్మానించారు. మాజీ ఎంపీటీసీ మిట్టపల్లి వసంత-వెంకటేషంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పిల్లలకు తల్లిపాలే శ్రేష్ఠం

పాలకుర్తి, ఆగస్టు 8: తల్లిపాలే పిల్లలకు శ్రేష్ఠమని సీడీపీవో అలేఖ్య పటేల్ అన్నారు. గురువారం మండలం పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవం ఘనంగా నిర్వహించారు. సీడీపీవో అలేఖ్య గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తల్లిపాలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. చిన్నపిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం జరిపించారు. సూపర్‌వైజర్ సువర్ణ, ఏఎన్ఎం విజయ, అంగన్‌వాడీ కార్యకర్తలు సీపెల్లి అంజలి, బద్రి భాగ్య, పొన్నం నిర్మల పాల్గొన్నారు.

## కునారంలో..

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 8: మండలంలోని కునారంలో గురువారం అంగన్‌వాడీ సెంటర్లో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. గర్భిణు, బాలింతలకు బాలామృతం, కోడిగుడ్లు, పప్పుధాన్యాలను అందజేశారు. వైద్య ఆరోగ్య విస్తరణ అధికారి ఆరెల్లి లక్ష్మణ్, అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, వసంత, స్వరూప, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంటల పరిశీలన

కమాన్‌పూర్, ఆగస్టు 8 : మండలంలోని రొంపికుంట, నాగారం శివారులో వ్యవసాయ పంటలను జిల్లా వ్యవసాయాధికారి దోమ ఆదిరెడ్డి పరిశీలించారు. వ్యవసాయ విస్తరణాధికారి అజ్మీర సురేష్ పాల్గొన్నారు.

## పోస్టర్ ఆవిష్కరణ

కమాన్‌పూర్, ఆగస్టు 8 : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో మహిళ సాధికారత కార్యక్రమాల పోస్టర్‌ను జిల్లా కోఆర్డినేటర్ దయా అరుణ ఆవిష్కరించారు. ఎంపీడీవో సురేష్, ఎస్ఐ చంద్రశేఖర్, ఏపీఎం శైలజాశాంతి, సీసీ ఎల్లమ్మ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి తదితరులు ఉన్నారు.

## వాహనాల తనిఖీ

కమాన్‌పూర్, ఆగస్టు 8 : మండల కేంద్రంలోని పెద్దపల్లి-మంథని ప్రధాన రహదారిపై ఎస్సై మామిడాల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఏఎస్ఐ బాలాజీనాయక్ తదితరులు ఉన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

సుల్తానాబాద్, ఆగస్టు 8 : సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేగడిమద్దికుంటలో గురువారం పేకాట ఆడుతున్న ముగ్గురిని పట్టుకున్నామని ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి 9200 రూపాయలను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

# పచ్చదనం, పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలి - పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య



బొంపల్లి గ్రామంలోని పాఠశాలను పరిశీలిస్తున్న ఆర్డీవో గంగయ్య



పుట్నూర్‌లో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శివయ్య

పెద్దపల్లి రూరల్ , ఆగస్టు 8 : స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పెద్దపల్లి ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి గంగయ్య అన్నారు. గురువారం మండలంలోని అప్పన్నపేట, బొంపల్లి గ్రామాల్లో ఆర్డీవో పర్యటించారు. ఈసందర్భంగా పలు వీధుల్లో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు వివరించారు. గ్రామంలో ఎక్కడ చూసిన ప్లాస్టిక్ కనిపించొద్దని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని ఆర్డీవో సూచించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి వాటికి ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలని, సీజనల్ వ్యాధుల దృష్ట్యా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఏంపీవో ఫయాజ్, ఏపీవో రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు సంపత్, శ్రీలతతో పాటు సిబ్బంది ఉన్నారు.

వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కకు ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవిందర్ రాథోడ్ అన్నారు. గురువారం మండలంలోని సబ్బితం ప్రధాన రహదారికి ఇరువైపులా నాటిన అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవిందర్ రాథోడ్ మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని, ఎక్కడైనా మొక్కలు ఎండిపోతే వాటి స్థానంలో తిరిగి మొక్కను నాటాలని సూచించారు. విద్యుత్ వైర్ల కింద మొక్కలు నాటవద్దని సూచించారు. వెంట ఏపీవో రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి అఫ్జల్ పాష, టెక్నికల్ అసిస్టెంట్ సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ ఇళ్ల రమేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పాలకుర్తి, ఆగస్టు 8: మండలం పరిధిలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛదనం- పచ్చదనం పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎంపీడీవో పొల్సాని శశికళ, మండల ప్రత్యేక అధికారి శివయ్యమండల పంచాయతీ అధికారి సుదర్శన్‌లు గురువారం పలు గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం పనులను పరిశీలించారు. పల్లెల్లో ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రజలకు స్వచ్ఛదనం-పచ్చదనంపై అవగాహన కల్పిస్తున్నారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వైద్యులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లి, ఆగస్టు 8 : మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం పనులను ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సంయుక్తంగా ప్రజల భాగస్వామ్యంతో పక్కాగా నిర్వహించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పద్మజ అన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లితో పాటు పలు గ్రామాల్లో ఆమె పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నిలువ నీరు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రత్యేకంగా దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.

సుల్తానాబాద్, ఆగస్టు 8: గ్రామాలలో రోడ్లపై గానీ ఇళ్ల ముందు కానీ ఎక్కడా నీరు నిలిచి ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయా పంచాయతీ కార్యదర్శులకు మండల ప్రత్యేకాధికారి జగన్మోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పలుచోట్ల మొక్కలు నాటడడంతో పాటు గ్రామంలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. కనుకుల గ్రామంలో గుంతలు ఏర్పడి అందులో నీరు నిలిచి ఉన్న వాటిల్లో కంకర పోయించి నీరు నిలువకుండా చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. అల్లీపూర్ గ్రామం జ్వర పీడితులతో నిండిపోయిన సందర్భంలో అధికారులు తగిన చర్యలు తీసుకుని ప్రజలకు వైద్య చికిత్సలు అందించారని, ప్రస్తుతం జ్వరాలు అదుపులో ఉన్నాయన్నారు. అయినా కూడా తాము అధికారుల బృందంతో ప్రతీరోజు ఇంటింటా జర సర్వే చేయిస్తున్నామని వివరించారు. ఆయన వెంట ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



అల్లీపూర్‌లో ఇంటింటా జ్వర సర్వేను పర్యవేక్షిస్తున్న అధికారులు

# ఆర్మ్‌డ్ సిబ్బందికి రెయిన్ కోట్స్ అందజేసిన సీపీ



ఆర్మ్‌డ్ సిబ్బందికి రెయిన్ కోట్స్ అందజేస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, ఆగస్టు 8: రామగుండం పోలీస్ కమీషనరేట్‌లో పని చేస్తున్న సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు రామగుండం పోలీస్ కమీషనర్ ఎం శ్రీనివాస్ అన్నారు. వర్షాకాల సమయంలో విధినిర్వహణకు ఉపయోగపడే రెయిన్ కోట్స్‌ను ఆర్మ్‌డ్ సిబ్బందికి గురువారం పోలీస్ కార్యాలయంలో సీపీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పని చేసే సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, నిరంతరం ఎండనకా, వాననకా రాత్రింబవళ్ళు కష్టపడి పనిచేసే సిబ్బందికి అత్యవసర సమయాలలో రెయిన్ కోట్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విధి నిర్వహణ సమయంలో అప్రమత్తంగా ఉంటు విధులు నిర్వహించాలని, ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) సీ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు దామోదర్, కన్న మధు, మల్లేషం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోదావరిఖని-1టౌన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మరణించిన పీ ప్రవీణ్ భార్య అనూషకు భద్రత ఎక్స్‌గ్రేషియా క్రింద రూ.5.49లక్షల చెక్‌ను గురువారం రామగుండం పోలీస్ కమీషనర్ ఎం శ్రీనివాస్ తన కార్యాలయంలో అందజేశారు.

కమిషనరేట్‌లో షీ టీమ్స్, సైబర్ క్రైమ్, టీ-సేఫ్ యాప్, చైల్డ్‌లైన్, గంజాయికి సంబందించిన ఏదైనా సమాచారం అందించడం కోసం, ఎవరైనా ఆపద సమయంలో పోలీస్ సహాయం కోసం ప్రజల్లో చైతన్యం కల్పించడానికి రూపొందిన వాల్ పోస్టర్‌ను సీపీ శ్రీనివాస్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

# ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి : కలెక్టర్

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 8 : పట్టణంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరా లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. గురువారం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్, ఆరోగ్య మహిళా కార్యక్రమం అమలు, వైద్య పరీక్షల నిర్వహణ, రిఫరల్ కేసులు, అవుట్ పేషెంట్ వంటి పలు అంశాలను కలెక్టర్ అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రిఫర్ చేసిన కేసులను ఫాలో అప్ చేయాలన్నారు. ఆరోగ్య మహిళా కార్యక్రమం కింద వచ్చే మహిళలకు అవసరమైన అన్ని పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గర్భిణుల ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్ 100 శాతం పూర్తిచేయాలన్నారు. ఔట్ పేషెంట్ రోగులకు అవసరమైన వైద్య పరీక్షలను తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్ ద్వారా నిర్వహించాలని తెలిపారు. వెంట వైద్య అధికారి డాక్టర్ స్వప్న, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్, సుల్తానాబాద్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

సుల్తానాబాద్, ఆగస్టు 8: సాంఘిక సంక్షేమ శాఖ విద్యార్థి వసతి గృహాలలో ఉంటున్న విద్యార్థులకు అవసరమైన కనీస వసతి సౌకర్యాలు ఏర్పాటుచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సుల్తానాబాద్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ విద్యార్థి వసతి గృహాన్ని కలెక్టర్ గురువారం రాత్రి తనిఖీచేశారు.హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులతో ఆయన మాట్లాడారు. హాస్టల్‌లో సౌకర్యాలు గురించి ఆరాతీశారు. హాస్టల్ మొత్తాన్ని కలియ తిరుగుతూ పరిశీలించారు. హాస్టల్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పించాలని, విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.




## బాధ్యతలు స్వీకరించిన ఆర్‌జీ-1 జీఎం

గోదావరిఖని, ఆగస్టు 8: ఆర్‌జీ-1 జీఎంగా నియమితులైన డీ లలిత్ కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. వివిధ డిపార్ట్‌మెంట్ అధికారులు లలిత్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం జీఎం జీడీకే ఓసీపీ-5ని సందర్శించారు. ఓసీపీ వ్యూపాయింట్ దగ్గర మ్యాప్‌లను పరిశీలించి గ్యాలరీలల్లో పని స్థలలలో జరుగుతున్న పనిని, బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతకు, రవాణాకు సంబంధించి వివరాలను అధికారులను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం రాంమ్మోహన్, ఏజీఎం(పర్సనల్) సీహెచ్ లక్ష్మీనారాయణ, పర్సనల్ మేనేజర్ కిరణ్ బాబు, అధికారులు భైద్య, చిలుక శ్రీనివాస్, చంద్ర శేఖర్, శివ నారాయణ, ఆంజనేయులు, ఆంజనేయప్రసాద్, కిరణ్ రాజ్ కుమార్, ధనలక్ష్మిబాయి, వరప్రసాద్, నాగేశ్వరరావు, ఎస్‌వీరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన ఆర్‌జీ-1 జీఎం

ఆర్‌జీ-1 జీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన లలిత్ కుమార్ రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ ఆర్‌జీ-1లో ఉద్యోగుల సంక్షేమంతో పాటు సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన జీఎంకు సూచించారు.

## ఓసీపీ-2ను సందర్శించిన డీఎంఎస్(మెకానికల్)

రామగిరి, ఆగస్టు 8: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2 ప్రాజెక్టును గురువారం డిఎంఎస్(మెకానికల్) సుధీర్‌గణపతిరావు భైసరే సందర్శించారు. ఓసీపీ-2 వ్యూపాయింట్ ద్వారా పరిశీలించారు. అనంతరం జీఎం చాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. యంత్రాల పనితీరు, భద్రతాపరమైన అంశాలపై చర్చించారు. రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-3 రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్ఎన్ గుప్తా, జీఎం సుధాకర్‌రావు, అధికారులు వైవి శేఖరబాబు, రాజేందర్, నాగరాజు, రామారావు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య వేడుకల నిర్వహణపై జీఎం సమీక్ష

రామగిరి, ఆగస్టు 8: స్వాతంత్ర్య వేడుకల నిర్వహణ, వనమహోత్సవ కార్యక్రమాలపై గురువారం అధికారులతో జీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. జీఎం కార్యాలయం చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. జీఎం కార్యాలయంలో నిర్వహించే జెండా ఆవిష్కరణ, ఉత్తమ ఉద్యోగుల సత్కారం, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలపై అధికారులతో ప్రదానం చర్చించారు. వేడుకల ఏర్పాట్ల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. వేడుకలు ఘనంగా ఉండాలని సూచించారు. శుక్రవారం ఓసీపీ-2 ప్రాజెక్టు ఆవరణలో వనమహోత్సవ కార్యక్రమా ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు. ఈ కారక్రమంలో అధికారులు రఘుపతి, శేఖర్, శ్రీనివాసులు, రాజేందర్, కర్ర, రవీందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న జీఎం

### ప్రాజెక్టు అధికారికి వీడ్కోలు సన్మానం

బదిలీపై వెళ్తున్న ఓసీపీ-2 ప్రాజెక్టు అధికారి రాజేందర్‌ను గురువారం జీఎం కార్యాలయంలో జీఎం సుధాకర్‌రావు, అధికారులు శాలువ, పూలదండలతో ఘనంగా సన్మానించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కార్పొరేట్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ కార్యాలయానికి బదిలీ వెళ్తున్న సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రఘుపతి, శేఖర్, శ్రీనివాసులు, రాజేందర్, చంద్రశేఖర్, కర్ర, రవీందర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## గ్రీజర్ హెల్పర్ ప్రమోషన్లలో అన్యాయం

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 8: ఈపీ గ్రీజర్ హెల్పర్‌ల పదోన్నతులలో ఆర్జీ-2 యాజమాన్యం సీనియర్ కార్మికులకు అన్యాయం చేసిందని హెచ్ఎంఎస్ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ దావు రమేష్ ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం సీనియర్లకు ఇవ్వాల్సిన ప్రమోషన్లు జూనియర్లకు ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. అధికారులు ఇష్టారీతిన ప్రమోషన్లు ఇవ్వడంతో సీనియర్లు అసంతృప్తికి లోనవుతున్నట్టు తెలిపారు. హెవీ మిషనరీ మీద పనిచేసి అనుభవం ఉన్న కార్మికులకు కాకుండా జూనియర్లను ఎంపిక చేయడం ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదని, సీనియర్లకు అన్యాయం జరగకుండా మిగతా ఏడుగురికి ప్రమోషన్లు ఇవ్వాలని దావు రమేష్ ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

## రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం గడువు పొడిగింపు

శ్రీరాంపూర్, ఆగస్టు 8: రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకానికి దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల12 వరకు పొడిగించినట్లు సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన యువత సివిల్స్ పరీక్షల్లోని ప్రిలిమ్స్ విభాగంలో ఉత్తీర్ణత సాధిస్తే సింగ రేణి పక్షాన లక్షరూపాయల ఆర్థికసహాయం చేయ నున్నట్లు పేర్కొన్నారు. ఈపథకం కోసం ఈనెల6వరకు దరఖాస్తుల గడువు ఉండగా, అభ్యర్థుల నుంచి వచ్చిన అభ్యర్థలను పరిగణలోకి తీసుకొని దాని ని 12వరకు పొడిగించినట్లు వివరించారు. అర్హులైన అభ్యర్థులు సింగరేణి వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### డైరెక్టర్లను కలిసిన నాయకులు

కొత్తగూడెంలో డైరెక్టర్‌లు సత్యనారాయణరావు, ఎన్‌వీకే శ్రీనివాస్‌కు గురువారం ఎస్‌టీపీపీ హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్ ఆధ్వర్యంలో నాయకులు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. విక్రమ్‌కుమార్, ప్రదీప్‌రెడ్డి, సాయికృష్ణా రెడ్డి, చిప్పకుర్తి సంపత్, నవీన్ పాల్గొన్నారు.

## 'రెండో విడత దళిత బంధు పథకం చేపట్టాలి'

పెద్దపల్లిటౌన్, ఆగస్టు8: రెండో విడత దళితబంధు చేపట్టాలని బుధవారం మంథని డివిజన్ దళితబంధు అధ్యక్షుడు ఊట్ల శ్రీను ఆధ్వ ర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రౌండింగ్ వర్క్ పూర్తి చేసుకుని కలెక్టర్, ఎంపీడీవో గ్రామ కార్యదర్శిలతో ఎన్నుకోబడిన దళిత బంధు లబ్ధిదారులకు వెంటనే ఈ పథకం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమములో ఆర్ల స్వామి, గద్దల శంకర్ కాదాసి తిరుపతి మౌటమ్ లక్ష్మి, మోదరి మంగమ్మ, అవునూరి రాజలింగు, దాసరి రామస్వామి, అంబటి కనకయ్య, ఇటుకల వెంకటేష్, మడిపల్లి కమలాకర్, కట్ట శ్రీను, అగ్గిమల్లె నరసన్న, నల్లాల లక్ష్మి, దూడపాక మల్లేష్, నర్సింగ్ దాసరి విష్ణు రమేష్ పాల్గొన్నారు.

## నారాయణ సేవలు మరువ లేనివి



నారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 8: సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మాదన నారాయణ సేవలు మరువలేనివని పార్టీ నగర కార్యదర్శి కనకరాజు అన్నారు. నారాయణ 4వ వర్ధంతి సందర్భంగా గురువారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి చౌరస్తాలోని పోచమ్మగుడి ఆవరణలోని నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ, దాని అనుబంధ సంఘం ఏఐటీయూసీలో పని చేసిన నారాయణ నీతి నిజాయితీకి మారుపేరుగా నిలిచారని, ఆయన నాయకత్వంలో కార్మిక క్షేత్రమైన గోదావరిఖనిలో పార్టీని, ప్రజాసంఘాలను బలోపేతం చేసి అందరికి మార్గదర్శకంగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా నాయకులు గోషిక మోహన్, గౌతం గోవర్ధన్, ఆరెల్లి పోషం, తాళ్లపల్లి మల్లయ్య, శనిగరపు చంద్రశేఖర్, అబ్దుల్ కరీం, రేణికుంట్ల ప్రీతం, మాటేటి శంకర్, నవీన్, చంద్రయ్య, జయపాల్, తిరుమల్, రాజేశ్వర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

కోల్‌సిటీ, ఆగస్టు 8: ఇటీవల గోదావరిఖనిలో మృతిచెందిన పలువురి కుటుంబ సభ్యులను గురువారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ పరామర్శించారు. హనుమాన్‌నగర్‌లో ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన జర్నలిస్టు మధునయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూర్యనగర్‌లోని కార్మిక నాయకుడు కెంగర్ల మల్లయ్య తల్లి నర్సమ్మ ఇటీవల మృతిచెందగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేక్ వెంట నాయకులు మల్లికార్జున్, రవి కుమార్, బోయిన మల్లేష్‌యాదవ్, తిప్పారపు మధు, దీపక్, గడ్డం మధు, నరేందర్‌రెడ్డి, గుమ్మడి సంపత్ ఉన్నారు.

## యువతి వివాహానికి ఆర్థిక సహాయం

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 8: లయన్స్ క్లబ్ అఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో తండ్రి లేని పేదింటి అమ్మాయి పెళ్లి ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించారు. చందపల్లి గ్రామానికి చెందిన చిట్టవేన అనూష తండ్రి గతంలోనే మరణించారు. నిరుపేద కుటుంబానికి చెందిన చిట్టవేన కనకలక్ష్మి తన మూడవ కుమార్తె అనూష పెండ్లి ఖర్చుల కొరకు లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి 14 వేల రూపాయల నగదు అందజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి సభ్యుల ద్వారా విరాళం సేకరింరించారు. విజ్జన్న యువసేన ఆధ్వర్యంలో క్వింటాల్ బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి అధ్యక్షులు లయన్ వేల్పుల రమేశ్, సెక్రెటరీ బోడకుంట రాంకిషన్, ట్రెజరర్ లయన్ మీసాల సత్యనారాయణ, సీనియర్ సభ్యులు లయన్ కావేటి రాజగోపాల్, లయన్ కొమ్ము తిరుపతి, లయన్ ఎద్దు శంకరయ్య, లయన్‌వనపర్తి శ్రీనివాస్, లయన్ ఓ.మహేందర్ రావు,భూతగడ్డ సంపత్, తాడూరి శ్రీమాన్, బొడ్డుపెల్లి శ్రీనివాస్, ఉప్పు గోపి పాల్గొన్నారు.

## ముప్పిరితోటలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ఎలిగేడు, ఆగస్టు8: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎహెచ్‌సీ వైద్యులు నిస్సిక్రిష్టాన, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, సిహెచ్‌వో విజేందర్‌రాజు సూచించారు. మండలంలోని ముప్పిరితోటలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. 101మందిని పరీక్షించి 65మందికి మలేరియా, 60మందికి డెంగ్యూ టెస్టులు చేసి మందులను పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటా ఫీవర్ సర్వే చేసి పలు సూచనలు అందించారు. వర్షకాల సీజన్‌లో ఇంటింటా పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. ఈకార్యక్రమాల్లో పీహెచ్‌సీ వైద్యులు నిస్సిక్రిష్టాన, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, సిహెచ్‌వో విజేందర్‌రాజు, సూపర్‌వైజర్ నాగమణి, ఏఎన్ఎం లత, ఆశాలు, సంధ్య, కళావతి, జిపి కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు8: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. కాలనీవాసులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. రక్త నామమునాలను సేకరించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఆరోగ్యం, సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, గ్రామ కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, ఏఎన్ఎం సరోజన, ఆశాలు మౌనిక, భూలక్ష్మి పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి

ఎలిగేడు, ఆగస్టు 8: విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు పెంపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి అన్నారు. ప్రాథమిక పాఠశాల సుల్తాన్‌పూర్‌లో డ్యూయల్ డెస్కులు, షూస్ వితరణ కార్యక్రమానికి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అప్పిడి సంతోష్ రెడ్డి సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి డి.మాధవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సుల్తాన్‌పూర్ వాస్తవ్యులు గ్రామ పూర్వ విద్యార్థి శివపల్లి రాజేశం ప్రాథమిక పాఠశాలకు లక్ష రూపాయలు వెచ్చించి డ్యూయల్ డెస్కును అందజేశారు. అలాగే రూ.20వేల విలువగల షూస్, సాక్స్‌లను కరీంనగర్‌కు చెందిన ఎడబోయిన రమసంజీవరెడ్డి దంపతులు విద్యార్థుల కోసం అందజేశారు. వీటిని విద్యాశాఖ అధికారి మాదవి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ శివపల్లి రాజేశం, రమసంజీవరెడ్డి సామాజిక సేవలో భాగంగా విద్యార్థులకు డ్యూయల్ డెస్కులు, షూస్‌లను విద్యార్థులకు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా మాజీ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు గంద్ర దేవేందర్‌రావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నరేంద్రచారి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం శివపల్లి రాజేశం, ఎక బోయిన రమసంజీవరెడ్డిని ఘనంగా సన్మానించారు.

## 'హర్ ఘర్ తిరంగా'ను విజయవంతం చేయండి

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 8: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 13 నుంచి 15 వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ చెన్నూరి ప్రభారి క్యాతం వెంకటరమణ పిలుపునిచ్చారు. గురువారం లక్ష్మీనగర్‌లో నిర్వహించిన మండల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఇంటిపైన త్రివర్ణ పతాకాలు ఎగురవేయాలని, యువకుల చేత ర్యాలీ నిర్వహించాలని సూచించారు. పార్టీ సభ్యత్వ నమోదులో అత్యధిక సభ్యత్వ నమోదు చేయాలని సూచించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కోడూరి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మురళి, సత్యనారాయణ, రాజ్‌కుమార్, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, దాసరి ఉష, రఘు, శ్రీనివాస్, శివ, రాజశేఖర్ పాల్గొన్నారు.